ఆలయాల్లో 'స్వచ్ఛ అభియాన్'



హస్తినాపురంలోని రామాలయాన్ని శుభ్రం చేస్తున్న సామ రంగారెడ్డి



ఆంజనేయ ఆలయాన్ని శుభ్రం చేస్తున్న కార్పొరేటర్, తదితరులు

హస్తినాపురం: ప్రపంచంలో దేవుడిని పూజించడం మొదటి పని ఐతే..పరిసరాలను పరిశుభ్రం చేసుకోవడం రెండవ పని అని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని రంగారెడ్డి అర్బన్‌జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా గుళ్లలో స్వచ్ఛ అభియాన్ (స్వచ్ఛ తీర్థ్) కార్యక్రమం నిర్వహించాలన్న బీజేపీ అధిష్ఠానం పిలుపు మేరకు గురువారం హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని రామాలయాన్ని ఆయన కార్యకర్తలతో కలిసి శుద్ధి చేశారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నరేశ్‌యాదవ్, నాయకులు రాజేంద్రప్రసాద్, అమరేందర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, మాధవరెడ్డి, శేఖర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో..

చైతన్యపురి: అయోధ్యలో భవ్య రామ మందిరంలో ప్రతిష్ఠ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు కోదండరాంనగర్ కాలనీలోని ఆంజనేయ ఆలయంలో స్వచ్ఛ తీర్థ్ కార్యక్రమాన్ని నిర్వహించామని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆలయం ఆవరణ అంతా శుభ్రం చేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు సత్యనారాయణ, వెంకటేష్‌చారి, దాసరి జయప్రకాష్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్ చారి, సుబ్బారెడ్డి, కేశవ్, శివరామ్ దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

సైదాబాద్: పరిసరాల పరిశుభ్రతకు అందరూ ప్రాధాన్యం ఇవ్వాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి అన్నారు. కరణబాగ్ కాలనీలోని మల్లికార్జునస్వామి ఆలయంలో ఇటీవల జాతర మహోత్సవాలు నిర్వహించారు. ఉత్సవాలు ముగియడంతో ఆలయ ప్రాంగణం, పరిసరాల్లో వ్యర్థాలు పేరుకుపోయాయి. బీజేపీ నాయకులతో కలిసి గురువారం అక్కడికి చేరుకున్న కార్పొరేటర్ ఆలయ పరిసరాల్లో స్వచ్ఛ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అక్కడి వ్యర్థాలు, చెత్తను తొలగించారు. జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ జవాన్ నర్సింగ్‌రావు, ఎస్‌ఎఫ్‌ఏ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మహోన్నత శక్తి ఎన్టీఆర్: ఎమ్మెల్యే

వనస్థలిపురం: తెలుగువారి ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిచెప్పిన మహోన్నత శక్తి నందమూరి తారక రామారావు అని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి, దివంగత ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా గురువారం వనస్థలిపురం పనామా చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే లింగోజిగూడ డివిజన్ సాయినగర్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీఆర్ చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్‌గుప్తా, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు, నాయకులు ఈశ్వరమ్మ యాదవ్, చిత్తలూరి వెంకటేశ్వర్లు, అనంతుల రాజిరెడ్డి, చింతల రవికుమార్, వరప్రసాద్ రెడ్డి, బోడ భిక్షపతి, మధుసాగర్, అనిల్ చౌదరి, నర్రె శ్రీనివాస్, తిలక్, భాస్కర్, ఇంద్రజ, లక్ష్మీప్రసన్న సత్యనారాయణ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



పనామా చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



సమావేశంలో మాట్లాడుతున్న నందనవనం జూ.కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి

హస్తినాపురం: ప్రభుత్వ మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాల హెచ్‌ఈసీ, సీఈసీ గ్రూపుల విద్యార్థులు గతేడాది అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారని నందనవనంలోని ప్రభుత్వ మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులను జానిమియా ఆర్‌ఎల్‌సీ-1, చాంద్రాయణగుట్ట బాలురు-1 ఆన్‌లైన్‌లో ఈనెల 18 నుంచి వచ్చే నెల ఫిబ్రవరి 6 వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూనియర్ కళాశాలలో మంచి హాస్టల్ సౌకర్యంతో పాటు క్రీడలు, యూనిఫారం, షూలు, పాఠ్యపుస్తకాలు , నోట్ పుస్తకాలు ప్రతి ఒక్కరికి అందజేస్తామన్నారు. మైనార్టీ విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

జూబ్లీహిల్స్ బాలురు-1 మైనార్టీ గురుకుల పాఠశాలలో ...

హస్తినాపురం డివిజన్ పరిధిలోని నందనవనం కాలనీలోని జూబ్లీహిల్స్ బాలురు-1 ప్రభుత్వ మైనార్టీ గురకుల పాఠశాలలో 2024-25 సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, జూబ్లీహిల్స్ బాలుర-1 మైనార్టీ గురుకుల పాఠశాలలో 6,7,8 తరగతుల్లో చేరేందుకు మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జనవరి 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

బాలానగర్ బాలికల కళాశాలలో ..

మన్సూరాబాద్: బాలానగర్ బాలికల మైనార్టీ గురుకుల కళాశాల 2024-25 విద్యాసంవత్సర ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.వినీల ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ సీఈసీ, హెచ్‌ఈసీ కోర్సుల్లో ప్రవేశానికి మైనార్టీ, నాన్ మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఎల్‌బీనగర్ సూర్యోదయనగర్‌లోని కళాశాలలో లేదా 9154365042, 9160255040 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలన్నారు.

చావణీ పాఠశాలలో..

చంచల్‌గూడ: చావణీలోని తెలంగాణ ప్రభుత్వ మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ విద్యాసాగర్ గురువారం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో 30 మైనార్టీ సీట్లు, 10 నాన్ మైనార్టీ సీట్లు, 6వ తరగతిలో 7 మైనార్టీ సీట్లు, 7, 8 తరగతుల్లో ఒక్కో సీటు అందుబాటులో ఉన్నాయన్నారు.

గ్యారంటీలు చేరువయ్యేలా కృషి

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

హుడాకాంప్లెక్స్: సీపీఐ భగత్‌సింగ్‌నగర్ నూతన ఫేజ్-1 శంకర్‌నగర్ శాఖ సమావేశం గురువారం పార్టీ నేతలు నిర్వహించారు. కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి హాజరై సభ్యులకు పార్టీ సభ్యత్వాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో భగత్‌సింగ్‌నగర్ స్థాపించింది సీపీఐ పార్టీయేనని, ఎన్నో పోరాటాల ఫలితంగా ఆనాడు అజీజ్‌పాషా నాయకత్వంలో బస్తీని ఏర్పాటు చేశామన్నారు. నాటి నుంచి నేటి వరకు స్థానిక సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాడుతుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలపైన కూడా కార్యకర్తలు దృష్టి సారించి అర్హులైన ప్రతి పేదవారికి అందేలా చూడాలన్నారు. సభ్యత్వాన్ని ఈ నెల 31 లోపు పూర్తి చేసి జిల్లా పార్టీకి అందజేయాలన్నారు. ఈ సందర్భంగా శంకర్‌నగర్ శాఖ నూతన అధ్యక్షుడుగా జిల్లా కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కన్వీనర్ నరసింహ, ఇద్రీస్ బాయ్, శ్యామల, భాగ్యమ్మ, రమణమ్మ, ఖాదర్, కిషన్, యూసుఫ్, జోసెఫ్, లావణ్య పాల్గొన్నారు.



కృష్ణకు సభ్యత్వాన్ని అందజేస్తున్న రవీంద్రాచారి

అభివృద్ధి పేరిట రోడ్ల ధ్వంసం

- పైప్‌లైన్ వేసేందుకు రోడ్ల తవ్వకాలు
- పని పూర్తయ్యాక మట్టిపోసి వదిలేసిన కాంట్రాక్టర్
- ప్యాచ్‌వర్క్ చేయకపోవడంతో రాకపోకలకు అవస్థలు



చైతన్యపురి డివిజన్ విద్యుత్‌నగర్‌లో అధ్వానంగా మారిన రహదారులు



చైతన్యపురి: అద్దంలా ఉన్న రోడ్లను అభివృద్ధి పనుల పేరిట అధికారులు కాంట్రాక్టర్లతో తవ్వి పోయిస్తున్నారు. పనులు పూర్తయ్యాక వాటికి ప్యాచ్ వర్క్‌లు చేయడం లేదు. అధ్వానంగా మారిన రోడ్లపై రాకపోకలకు జనం ఇబ్బందులు పడుతున్నారు. చైతన్యపురి డివిజన్ విద్యుత్‌నగర్‌లోని రోడ్ల పరిస్థితే ఇందుకు నిదర్శనం. అధికారుల పట్టించుకోకపోవడం వల్లే కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు కలుగజేసుకొని తమ కాలనీ రోడ్లకు మరమ్మతు చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

- తాగునీటి పైప్‌లైన్ వేసేందుకు చైతన్యపురి డివిజన్ విద్యుత్‌నగర్‌లోని రహదారులను ఆరు నెలల క్రితం తవ్వారు. పైప్‌లైన్ వేసిన కాంట్రాక్టర్ దానిపై మట్టిని కుప్పలుగా పోసి చేతులు దులుపుకున్నాడు.
- మట్టిని పోసి చదును చేయడంతో పాటు ప్యాచ్ వర్క్ చేయాల్సి ఉండగా అలాగే వదిలేశాడు.
- ఆ రోడ్లపై వాహనాలు వెల్లడంతో అస్తవ్యస్తంగా మారింది. అక్కడ గుంతలు ఏర్పడి పాదచారులు, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.
- తాగునీటి సరఫరా మెరుగు పర్చేందుకు కొత్త పైప్‌లైన్లు వేయడం బాగున్నప్పటికీ, రోడ్లను తవ్వి మరమ్మతు చేపట్టడంలో మాత్రం అధికారులు విఫలమవుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.
- అభివృద్ధి పనులు జరుగుతున్నప్పుడు సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఉండటం లేదని. కాంట్రాక్టర్‌తో సక్రమంగా పనులు చేయించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వారు అంటున్నారు.
- పైప్‌లైన్ వేసి ఆరు నెలలు కావస్తున్నా.. జలమండలి అధికారులు ఇంటింటికీ కనెక్షన్ మాత్రం ఇవ్వలేదని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదంటున్నారు.
- ఇప్పటికైనా జలమండలి ఉన్నతాధికారులు స్పందించి తమ కాలనీలో ఇంటింటికీ తాగునీటి కనెక్షన్లు ఇప్పించడంతో పాటు రహదారులకు ప్యాచ్‌వర్క్ పూర్తి చేయించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడాలని విద్యుత్‌నగర్ వాసులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా...



ఆరు నెలల క్రితం విద్యుత్‌నగర్ కాలనీలో రోడ్లు తవ్వి తాగునీటి పైప్‌లైన్ వేశారు. ఇంటింటికీ కనెక్షన్ ఇవ్వడంలో ఆలస్యమైనందున రోడ్డుకు ప్యాచ్‌వర్క్ చేపట్టలేదు. పైప్‌లైన్ వేయడంతో పాటు ఇంటింటికీ కనెక్షన్లు ఇవ్వాల్సిన బాధ్యత ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌దే. కాంట్రాక్టర్ రాకపోవటం వల్ల రోడ్లకు ప్యాచ్ వర్క్ జరగలేదు. జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పనులు పూర్తయ్యేలా చూస్తా.

– రంగా నర్సింహ గుప్తా, కార్పొరేటర్, చైతన్యపురి డివిజన్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



వనస్థలిపురం: మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దిగువ తెలిపిన ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని వనస్థలిపురం ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు.

◆ సంతోషిమాత ఫీడర్ పరిధిలో...
హనుమాన్‌నగర్, జెడ్పీ రోడ్డు, బీమానగర్, శ్రీరమణ కాలనీ, తుల్జాభవానీ నగర్, కస్తూరి కాలనీ, హస్తినాపురం నార్త్, శ్రీరామా అయోధ్య కాలనీ, ఆర్‌కేఆర్ ఎన్‌క్లేవ్, ఇంద్రప్రస్థ కాలనీ, సంతోషిమాత కాలనీ, అనుపమనగర్, ఏపీఎస్ ఈబీ కాలనీ, పీఎస్ఆర్ కాలనీ.

◆ శ్రీరమణ కాలనీ ఫీడర్ పరిధిలో...
రాజీవ్‌శెట్టి నగర్, శ్రీ రమణకాలనీ, గ్రీన్‌లాండ్ కాలనీ, వందనపురి కాలనీ, బాలాజీ కాలనీ, జెడ్పీ రోడ్డు.

◆ ఇంద్రప్రస్థ ఫీడర్ పరిధిలో...
ఇంద్రప్రస్థ కాలనీ ఫేజ్-1, 2, గోకుల్ ఎన్‌క్లేవ్ ఫేజ్-1,2, పీఎస్ఆర్ కాలనీ, వెంకటేశ్వరకాలనీ ఫేజ్-2, భారతీనగర్, టీఎస్ఆర్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదు.

ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో...

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, వివిధ మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని దిగువ తెలిపిన ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు.

ఉదయం 9 నుంచి 11 గంటల వరకు...
ఎస్‌బీహెచ్ కాలనీ, భవానీనగర్, హనుమాన్ టెంపుల్, మనోరమ ఐటీఐ, విద్యుత్‌నగర్, కుమారస్వామి టెంపుల్, పంచఫార్మా ఎస్ఐ, అడ్డగుట్ట, వాంబే కాలనీ, భవానీమాతా టెంపుల్, పోచమ్మ టెంపుల్, ద్వారకా నివాస్ పరిసర ప్రాంతాలు

ఉ. 11 నుంచి మ.ఒంటి గంట వరకు...
సాకేత్ డిగ్రీ కాలేజీ, సాయి డిగ్రీ కాలేజీ, సంతోష్ మాతా టెంపుల్ ఏరియా, దిల్‌సుఖ్‌నగర్ బస్‌డిపో, దిల్‌సుఖ్‌నగర్ పరిసర ప్రాంతాలు.

మ. 2 నుంచి సా.4 గంటల వరకు...
ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ, న్యూహనుమాన్ టెంపుల్, భవానీనగర్, ద్వారకాపురి, ప్రతాప్ నగర్, భాష్యం స్కూల్ పరిసర ప్రాంతాలు.

దళిత్ క్రిస్టియన్ దండోరా కో కన్వీనర్‌గా యిర్మీయా



మలక్‌పేట: దళిత్ క్రిస్టియన్ దండోరా తెలంగాణ రాష్ట్ర కో కన్వీనర్‌గా మలక్‌పేటకు చెందిన కూనదొడ్డి యిర్మీయా నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని యిర్మీయా అన్నారు. దేశ జనాభాలో 30 శాతం ఉన్న దళితులు, దళిత క్రైస్తవులు అణిచివేతకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు, దళిత క్రైస్తవులపై దాడులు జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. దళితులు, దళిత క్రైస్తవుల రాజకీయంగా బలపడం కోసం, వారి అభివృద్ధే లక్ష్యంగా ఉద్యమిస్తామన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ (టీఎస్) నేతలు

మన్సూరాబాద్: గత 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా పోరాటాలు చేస్తున్నామని, రానున్న పార్లమెంట్ సమావేశాల్లో వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎంఆర్‌పీఎస్ (టీఎస్) జాతీయ ప్రధాన కార్యదర్శి జీడీ నర్సింహ మాదిగ డిమాండ్ చేశారు. ఎల్‌బీనగర్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణకు అఖిలపక్షాన్ని కేంద్రం ప్రభుత్వం వద్దకు తీసుకెళ్లాలని కోరారు. గత ప్రభుత్వంలో దళిత బంధుకు ఎంపికైన వారందరికీ ఆ పథకాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మాదిగ ఉపకులాలకు, మాదిగ ఎమ్మెల్యేకు సముచిత స్థానం కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు సక్రమంగా వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ (టీఎస్) జాతీయ మహిళ అధ్యక్షురాలు ఆకారపు రుక్కమ్మ, కోర్ కమిటీ నాయకులు చిన్నగల యాదయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు వేముల సూర్య ప్రకాష్, పసుపుల హరిబాబు, చింతకుంట్ల రామస్వామి, సైదులు, ధనలక్ష్మి, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దేశ భక్తి గీతాల పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లకుంట: రిపబ్లిక్ డేను పురస్కరించుకొని శ్రీ సాయి శృతి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో నిర్వహించే దేశ భక్తి గీతాల పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని అకాడమీ డైరెక్టర్ గౌరీభట్ల వసుధామూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్స్ విభాగంలో 5 నుంచి 10 ఏళ్ల లోపు, జూనియర్స్ విభాగంలో 11 నుంచి 20 ఏళ్లు, సీనియర్స్ విభాగంలో 21 ఏళ్లు పైబడిన వారంతా ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. అన్ని వయస్సుల వారికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ప్రత్యేక విభాగాలుగా చేసినట్లు వివరించారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 22వ తేదీ లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని, అలాగే తాము ఆలపించిన ప్రైవేటు దేశ భక్తి గీతాల వీడియో రికార్డింగ్ చేసి పంపించాలని సూచించారు. ఈ పోటీల్లో పాల్గొనే వారికి ప్రశంసా పత్రాలు అందజేస్తామని చెప్పారు. విజేతలకు తాము నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆలిండియా రేడియో కళాకారుడు, గోల్డ్‌మెడలిస్ట్ గౌరీభట్ల లక్ష్మణమూర్తి పర్యవేక్షణలో నిర్వహించే కార్యక్రమానికి వర్ధమాన గాయనీమణులు యామిని, నందినిలు ఈవెంట్ మేనేజర్లుగా వ్యవహరిస్తారని చెప్పారు. ఔత్సాహికులు ఫోన్: 8374927736కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపించాలని కోరారు.

ఎఫ్‌సీఐ కన్సల్టేటివ్ కమిటీ సభ్యురాలిగా వరలక్ష్మి



కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) కన్సల్టేటివ్ కమిటీ సభ్యురాలిగా ఎన్.వరలక్ష్మిని నియమిస్తూ కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ కన్స్యూమర్ ఎఫైర్స్, ఫుడ్ అండ్ పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో గురువారం కాచిగూడలో వరలక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ... రెండు దశాబ్దాలుగా వివిధ రంగాలలో తాను అందించిన విశిష్ట సేవలను గుర్తించి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సభ్యురాలిగా నియమించిందని తెలిపారు. తన నియమకానికి సహకరించిన ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు, పార్టీల పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు నైపుణ్యాన్ని అందించడానికి, ఆహార భద్రతను మరింత మెరుగు పరచడానికి, తెలంగాణ రాష్ట్ర ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు.

నేడు, రేపు కులగణనపై జాతీయ సెమినార్

కాచిగూడ: ఆల్ ఇండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20 తేదీల్లో కులగణన, సామాజిక న్యాయం అనే అంశంపై యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో నేషనల్ సెమినార్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్ కుమార్, జాతీయ కార్యదర్శి ఎస్.సాయి కిరణ్ తెలిపారు. విద్యావేత్తలు, మేధావులు, రాజకీయ ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని కులగణనపై చర్చిస్తారన్నారు. వర్చువల్ మోడ్‌లో కూడా జరుగనున్న ఈ సెమినార్‌లో ప్రముఖ విధాన రూపకర్త సామ్‌పిట్రోడా, ద్రావిడ కళగం కార్యదర్శి కె.వీరమణి, డీఎంకే రాజ్యసభ సభ్యుడు పి.విల్సన్, స్వరాజ అభియాన్ అధ్యక్షుడు యోగేంద్ర యాదవ్, ప్రొఫెసర్ ఇ.వెంకటేశం, ఆళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు.

నిర్ణీత ప్రాంతాల్లోనే నిర్మాణ వ్యర్థాలు వేయాలి

- జోనల్ కమిషనర్ పంకజ

లింగోజిగూడ: నిర్ణీత ప్రాంతాల్లోనే నిర్మాణ వ్యర్థాలను వేయాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్మాణ వ్యర్థాల డంపింగ్ కోసం ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో పలు ప్రాంతాలను నిర్ణయించామన్నారు. ఇతర ప్రాంతాలలో, రోడ్లపై నిర్మాణ వ్యర్థాలను, కూల్చివేసిన భవన వ్యర్థాలను ప్రైవేట్ ట్రక్కుల యజమానులు తెచ్చి వేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. యూజర్ చార్జీలు చెల్లించకుండా రోడ్లపై వేసేవారిపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే సర్కిళ్ల డీసీలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో వ్యర్థాలను డంపింగ్ చేయడానికి కాప్రా సర్కిల్‌లోని సాకేత్ డంపింగ్ పాయింట్, ఉప్పల్ సర్కిల్ పరిధిలో దేవేందర్ నగర్ డంపింగ్ పాయింట్, హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని జీఎస్ఐ రోడ్డు డంపింగ్‌కు కేటాయించామన్నారు. నిర్ణయించిన ప్రాంతాల్లో తప్ప ఇతర ప్రాంతాల్లో వ్యర్థాలు వెయ్యరాదని కమిషన్ పంకజ పేర్కొన్నారు.

ధ్యానాంజనేయ స్వామి సేవలో ఎమ్మెల్యే కసిరెడ్డి



ఎమ్మెల్యే నారాయణరెడ్డిని సన్మానిస్తున్న నల్లా రఘుమారెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయానికి గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దంపతులు హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు వారిని ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, సభ్యులు ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ పూజారులు వేద మంత్రాలతో ఆశీర్వదించి స్వామివారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

22న సెలవు ప్రకటించాలి: వీహెచ్‌పీ

వనస్థలిపురం: జనవరి 22న అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూసే అవకాశం కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్నం 2.30 గంటల వరకు సెలవు ప్రకటించిందని, అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా సెలవు ప్రకటించాలని విశ్వహిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి శాలివాహన పండరీనాథ్, సహ కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ ఒక ప్రకటనలో కోరారు. ప్రజలందరూ కుటుంబాలతో సహా ఆ మధుర ఘట్టాన్ని చూడాలని ఆశిస్తున్నారని, ప్రజల విశ్వాసాలను పరిగణలోకి తీసుకుని తెలంగాణ ప్రభుత్వం 22న సెలవు దినంగా ప్రకటించాలని వారు విజ్ఞప్తి చేశారు. దేవాదాయ శాఖ ఆధీనంలోని ఆలయాల్లో ఉత్సవాలు, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించి దీపోత్సవం నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని వీహెచ్‌పీ కోరుతోందని వారు అన్నారు.

టెట్ అర్హత నుంచి మినహాయింపు ఇవ్వాలి

చాదర్‌ఘాట్: తెలంగాణ రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఎస్.విజయభాస్కర్ విద్యాశాఖ అధికారులను కోరారు. గురువారం ఆయన మలక్‌పేటలో విలేకరులతో మాట్లాడుతూ, 50 ఏళ్లు పైబడిన వారికి ఎలాంటి డిపార్ట్‌మెంట్ పరీక్షలు ఉత్తీర్ణత సాధించకున్నా పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నాయన్నారు. 25 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసిన ఉపాధ్యాయులు, రేపోమాపో పదవీ విరమణ చేయబోతూ కనీసం ఒక పదోన్నతి అయినా తీసుకుందామనుకునే వారికి టెట్ అర్హత ఉండాలని చెప్పడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తెలంగాణ ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు టెట్ అర్హత నుంచి సీనియర్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరారు.

22న సీతారామచంద్ర శోభాయాత్ర

నాగోలు: అయోధ్యలో ఈ నెల 22న శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా కొత్తపేట డివిజన్ సత్యనగర్ కాలనీ కమాన్ నుంచి కొత్తపేట భవాని మందిరం వరకు సీతారామచంద్ర శోభాయాత్ర నిర్వహించనున్నారు. సాయంత్రం 3 గంటలకు యాత్ర ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఆర్‌కేపురంలో రథయాత్ర...

దిల్‌సుఖ్‌నగర్: అయోధ్యలో భవ్య శ్రీరామ మందిర ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా ఈనెల 22న ఆర్‌కేపురంలో అష్టలక్ష్మి ఆలయం, తత్వం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రామచంద్ర స్వామి రథయాత్ర నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు.అష్టలక్ష్మి ఆలయం నుంచి ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే రథయాత్ర.. కాలనీల్లో కొనసాగి ఉదయం 9గంటలకు తిరిగి ఆలయానికి చేరుకుంటుందన్నారు.

108లో ఉద్యోగ అవకాశాలు

వనస్థలిపురం: 108 సంస్థ (ఈఎంఆర్ఐ-హెచ్‌ఈఆర్‌ఎస్‌ఎఫ్)లో పైలెట్లు, ఈఎంటీఎస్‌గా రంగారెడ్డి జిల్లాలో పని చేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ వసంత్, జిల్లా కో ఆర్డినేటర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈఎంటీకి బీఎస్సీ (లైఫ్ సైన్స్), ఎంఎల్‌టీ అండ్ డీఎంఎల్‌టీ, బీ ఫార్మాలో ఉత్తీర్ణత గలవారు అర్హులన్నారు. పైలెట్ కోసం ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణతతో పాటు బ్యాడ్జి లైసెన్స్ ఉండాలన్నారు. ఇతర వివరాలకు ఫోన్ నం. 9154248992 లో సంప్రదించాలని వారు కోరారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు



వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 19, వంకాయ 23, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 55, బీర 40, క్యాబేజీ 19, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 40, దొండ 23-35, చిక్కుడు 23-40, గోకర 45, బీట్‌రూట్ 19, క్యాప్సికం 55, ఆలు 18-23, దోస 28, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 24, చామగడ్డ 60. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

రేవంత్‌రెడ్డి అభిమాన సంఘం అధ్యక్షుడిగా మహ్మద్ గౌస్

చాదర్‌ఘాట్: మలక్‌పేట రేవంత్‌రెడ్డి అభిమాన సంఘం అధ్యక్షుడిగా మహ్మద్ గౌస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం మలక్‌పేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి ఆయనను శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు బాబు శ్రీనివాస్, చౌకి రవికుమార్, ఆకుల రాజు, రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.